క్లుప్తంగా

విద్యుత్ ఏడీఈగా వెంకట్రావు



బాధ్యతలు స్వీకరిస్తున్న ఏడీఈ కె.వెంకట్రావు

యలమంచిలి రూరల్: విద్యుత్ శాఖ యలమంచిలి ఏడీఈగా కె.వెంకట్రావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఏపీఈపీడీసీఎల్ విశాఖపట్నం క్వాలిటీ కంట్రోల్ విభాగంలో అసిస్టెంట్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న వెంకట్రావు పదోన్నతిపై యలమంచిలి ఏడీఈగా నియమితులయ్యారు. వెంకట్రావు గతంలో యలమంచిలి ఏఈఈగా పనిచేశారు. విద్యుత్ వినియోగదారుల సమస్యలు త్వరితగతిన పరిష్కరించడం, నాణ్యమైన విద్యుత్‌ను అందించడానికి కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

104 సేవలను సద్వినియోగం చేసుకోవాలి



గంగాదేవిపేటలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ యామిని

మునగపాక : ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని డాక్టర్ యామిని కోరారు. మండలంలోని గంగాదేవిపేటలో శనివారం 104 సేవలు అందించారు. ఈ సందర్భంగా సీజన్‌లో ప్రజలు అంటువ్యాధులకు గురికాకుండా ఉండేందుకు తగు జాగ్రత్తలు పాటించాలని రోగులకు సూచించారు. ఎటువంటి అనారోగ్యం సంభవించినా నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలన్నారు. శిబిరాన్ని ఉప సర్పంచ్ మొల్లేటి దేవీచంద్ర సందర్శించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు నూకాలమ్మ , వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మండలంలో మోస్తరు వర్షం



మండలంలో కురుస్తున్న వర్షం

ఎస్.రాయవరం : మండలంలో శనివారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. గడిచిన రెండు రోజులు ఎండ, వేడి వాతావరణంతో సతమతమైన మండల వాసులకు శనివారం సాయంత్రం కురిసిన వర్షంతో ఉపశమనం కలిగింది. వర్షంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. రోడ్లపైకి నీరు చేరడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు.

క్రమశిక్షణ చాటుదాం...



కశింకోట వద్ద జాతీయ రహదారిని వరుసగా దాటుతున్న బీసీ బాలుర హాస్టల్ విద్యార్థులు

కశింకోట : కశింకోటలో బీసీ సంక్షేమ బాలుర వసతి గృహం విద్యార్థులు అంతా కలిసికట్టుగా ఒక వరుస క్రమంలో హైస్కూలుకు వెళ్లి రావడం స్థానిక ప్రజలకు ఆసక్తిని కలిగిస్తోంది. వసతి గృహం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉంది. అక్కడి నుంచి సుమారు అర కిలోమీటరు దూరంలో గ్రామంలో డీపీఎన్ జెడ్పీ హైస్కూలు ఉంది. అక్కడికి వసతి గృహంలో ఉంటూ చదువుతున్న విద్యార్థులు ఉదయం స్కూలుకి వెళ్లేటప్పుడు, సాయంత్రం స్కూలు ముగిశాక వసతి గృహానికి చేరడానికి వరుస క్రమం పాటిస్తూ వసతి గృహం సిబ్బంది పర్యవేక్షణలో గమ్యానికి చేరుతున్నారు. ఈ క్రమంలో వీరు స్థానిక కూడలి వద్ద రానూ పోనూ నిత్యం జాతీయ రహదారిని దాటాల్సి ఉంటుంది. ఇక్కడ కూడా పోలీసుల సహకారంతో రద్దీగా వచ్చే వాహనాల రాకపోకలు గమనించి వరుసగా అంతా ఒకేసారి రోడ్డు భద్రంగా దాటుతున్నారు. వీరి పట్ల స్థానికులు ఆసక్తిగా చూస్తూ ఆనందం వ్యక్తపరుస్తున్నారు.

ఆయుష్మాన్‌తో ఆరోగ్య రక్ష



రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు

- ఆయుర్వేదానికి పెరుగుతున్న ఆదరణ
- దీర్ఘకాలిక వ్యాధులకు చికిత్సలు
- వైఎస్సార్‌సీపీ పాలనలో 3 ఆస్పత్రులకు పూర్తి సదుపాయాలు
- వెల్‌నెస్ సెంటర్లుగా మార్పు



వేంపాడులో ఆయుర్వేద ఆస్పత్రి

నక్కపల్లి : ఒకనాడు అతీగతీలేక, ఆదరణకు నోచుకోని ఆయుర్వేద ఆస్పత్రులకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పూర్వ వైభవం తీసుకు వచ్చింది. వెల్‌నెస్ సెంటర్లుగా మార్పు చేసి అన్ని సదుపాయాలు కల్పించడంతో గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ఈ ఆయుర్వేద ఆస్పత్రులకు ఆదరణ పెరిగింది. ఆయుర్వేద వైద్యానికి 2021 నుంచి 2024 వరకూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇచ్చింది. పెద్దగా ఆదరణ లేదని, ఆలనా, పాలనా లేకుండా ఉన్న ఆయుర్వేద ఆస్పత్రులను హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లుగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఆయుష్‌శాఖ మార్చి వేసింది. ఒకప్పుడు కనీస సదుపాయాలు కూడా లేని ఆయుర్వేద ఆస్పత్రులు (వెల్‌నెస్ సెంటర్ల)లో ఇప్పుడు సకల సదుపాయాలు ఉన్నాయి. ఒక్కో ఆయుర్వేద ఆస్పత్రిలో సుమారుగా రూ.3 లక్షల నుంచి రూ 5.లక్షల వ్యయంతో గత ఏడాది ఆగస్టు నుంచి 2024 మార్చి వరకూ అనేక పనులు చేపట్టారు.

పెరిగిన ఓపీ సంఖ్య

పాయకరావుపేట నియోజకవర్గం పరిధిలో ఎస్.రాయవరం మండలం కొరుప్రోలు, నక్కపల్లి మండలం వేంపాడు ఆయుర్వేద ఆస్పత్రుల్లో అన్ని హంగులను సమకూర్చిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కింది. కొరుప్రోలులో పంచకర్మ సేవలను కూడా అందిస్తుండడం విశేషం. ఒకప్పుడు కేవలం ఐదారుగురు రోగులు కూడా ఆయుర్వేద ఆస్పత్రికి వచ్చేవారు కాదు. ఇప్పుడు అన్ని సదుపాయాలు, మందులు అందుబాటులో ఉండడంతో ఆయుర్వేద ఆస్పత్రుల ఓపీ కూడా గణనీయంగా పెరిగింది. నిత్యం 25నుంచి 50 మంది వరకు రోగులు ఆయుర్వేద వైద్యం కోసం ఆస్పత్రులకు వస్తున్నారు. జిల్లాలో అనకాపల్లి, వేంపాడు,



ఆస్పత్రిలో మందులు

కొరుప్రోలు, సర్వసిద్ధి, కన్నూరు పాలెం, యలమంచిలి, పాయకరావుపేటలో ఆయుర్వేద ఆస్పత్రులున్నాయి. వేంపాడు, కొరుప్రోలు, అనకాపల్లి ఆస్పత్రులను హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లుగా మార్చడం వల్ల ఈ ఆస్పత్రుల ఆవరణలో ఎన్నో ఔషధ గుణాలు గల మొక్కలను కూడా పెంచుతున్నారు. గత ప్రభుత్వం ఆయుర్వేద ఆస్పత్రులపై చూపిన శ్రద్ధ వల్ల ప్రస్తుతం ఆ ఆస్పత్రులు ఆహ్లాద వాతావరణాన్ని సంతరించుకున్నాయి. ఆయుర్వేద వైద్యం కోసం వస్తున్న రోగులకు మంచి సేవలు అందిస్తున్నాయి. అనేక దీర్ఘకాలిక వ్యాధులను నయం చేసుకునే మందులు ఇప్పుడు అన్ని ఆయుర్వేద ఆస్పత్రుల్లో అందుబాటులో వున్నాయి.

ఆరోగ్యమే ఐశ్వర్యం : డాక్టర్ బినయ్‌కుమార్

ఈ రోజుల్లో ఎవరు ఆరోగ్యంగా ఉంటారో వారే నిజమైన ఐశ్వర్యవంతులు. ఆయుర్వేదం ద్వారా దీర్ఘకాలిక వ్యాధులను కూడా నయం చేసుకోవచ్చని డాక్టర్ బినయ్‌కుమార్ తెలిపారు. ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవన్నారు.. పిల్లల నుంచి పెద్దల వరకూ అన్నిరకాల రోగాలకు మందులు వేంపాడు ఆస్పత్రిలో ఉన్నాయన్నారు.

ఎన్నో వ్యాధులకు పరిష్కారం

అధిక రక్తపోటు, షుగర్,వంటి వ్యాధులు సహా దగ్గు, గొంతునొప్పి, తలనొప్పి, అతిసారం, అజీర్ణం, గ్యాస్ట్రిక్, కీళ్లవాతం, మోకాళ్ల నొప్పులు, పక్షవాతం, చర్మవ్యాధులు, ఆస్తమా, ఎలర్జీ, కిడ్నీలో రాళ్లు, వెన్ను సమస్యలు, సయాటికా, వేరికోస్ వంటి వ్యాధులకు ఆయుర్వేద మందులు దివ్యౌషధంగా పనిచేస్తాయని వేంపాడు ఆయుర్వేద ఆస్పత్రి ఇన్‌ఛార్జి డాక్టర్ బినయ్‌కుమార్ చెప్పారు. ఆయుర్వేద వైద్య సేవలతో పాటు వెల్‌నెస్ సెంటర్లు వున్న చోట పిల్లలు, పెద్దల ఆరోగ్యం కోసం పురుష, మహిళా యోగా టీచర్లను కూడా ఆయుష్‌శాఖ నియమించింది. ఈ యోగా ఇన్‌స్ట్రక్టర్లు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రత్యేక యోగా తరగతులు నిర్వహిస్తున్నారు. చదువుతోపాటు మానసిక ఒత్తిడి తగ్గించేందుకు యోగాపై శిక్షణ ఇవ్వడం గమనార్హం. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు కూడా యోగా నేర్చుకోవడం విశేషం.

క్యాన్సర్ బారిన అధికంగా మహిళలు





క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కలిగిస్తున్న వైద్యురాలు కావ్యలక్ష్మి, హాజరైన మహిళలు

కశింకోట: ప్రాణాంతకమైన క్యాన్సర్ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలని మహాత్మాగాంధీ క్యాన్సర్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ వైద్య నిపుణురాలు కావ్యలక్ష్మి కోరారు. కశింకోటలోని సెయింట్ జాన్స్ స్కూలులో శనివారం క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో మహిళలకు క్యాన్సర్‌పై అవగాహన, స్క్రీనింగ్ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు ఎక్కువగా క్యాన్సర్ బారిన పడుతున్నారని, సర్వైకల్ క్యాన్సర్, రొమ్ము కాన్సర్, తదితర క్యాన్సర్ లక్షణాలతో మృతి చెందుతున్నారన్నారు.

క్యాన్సర్ బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని, క్యాన్సర్ లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలన్నారు. స్కూలు కరస్పాండెంట్ బత్తుల అనూరాధ మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఉపాధ్యాయ సిబ్బంది, మహిళలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమ్మె కాలంలో చేసిన పుస్తకాన్ని ఆవిష్కరించిన మజ్జి నాగశేషు

అనకాపల్లి : సార్వత్రిక ఎన్నికలో ముందు కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరిస్తామని చెప్పిన హామీలను తక్షణమే అమలు చేయాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మజ్జి నాగశేషు అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో అంగన్వాడీ 42 రోజుల సమ్మె కాలంలో చేసిన పుస్తకాన్ని శనివారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్మికుల కనీస వేతనం అమలు చేయాలని, ఉద్యోగ భద్రత, గ్రాట్యూటీ, సమ్మెకాలంలో చేసిన కార్మికులకు జీతాలు చెల్లించాలని ఆమె కోరారు. సమ్మెకాలంలో పోరాటానికి మద్దతు పలికిన టీడీపీ ప్రభుత్వం ప్రస్తుతం అధికారంలో ఉన్నాదని, గ్రాట్యూటీ అమలుకు కృషి చేస్తామనని నారా లోకేష్ సమ్మె శిబిరంలో ప్రకటించారని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో మంత్రిగా నారా లోకేష్ ఉన్నందున సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షురాలు ఎం.దుర్గారాణి, జిల్లా నాయకులు కాసులమ్మ, వి.వి.రమణమ్మ, జయలక్ష్మి, తనూజ, అంజలి, భ్రమరాంబ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు పాల్గొన్నారు.

పంద్రాగస్టున ప్రతి ఇంటా జాతీయ జెండా ఎగరాలి



సమావేశంలో మాట్లాడుతున్న ద్వారపురెడ్డి పరమేశ్వరరావు

తుమ్మపాల : హర్ ఘర్ తిరంగ్ భారత్ మూడు రంగుల జెండాను ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు ప్రతి ఇంటిపై ఎగరవేయాలని బీజేపీ జిల్లా ఇన్‌ఛార్జి కర్రి చిట్టిబాబు పిలుపునిచ్చారు. పట్టణంలో బీజేపీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 'తల్లి కొరకు ఒక మొక్క' అనే కార్యక్రమంపై కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన ప్రతి కార్యకర్త ఒక మొక్కను నాటి దాన్ని సంరక్షించి దాని ఫలాలను మన పిల్లలకు అందించాలన్నారు. దేశంలో పెరుగుతున్న కాలుష్యాన్ని నిర్మూలించేందుకు కృషి చేయాలన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇంటిపై జాతీయ జెండా ఎగరవేయాలన్నారు. మూడు రోజుల్లో దేశ నాయకులు విగ్రహాలను శుభ్రం చేసి పరిశుభ్రతకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా నాయకులు ఉమా, స్టేట్ కార్యవర్గ సభ్యులు పొన్నగంటి అప్పారావు, పుట్ట గంగయ్య, జిల్లా పార్లమెంటు కన్వీనర్ జిల్లా ప్రధాన కార్యదర్శి వర్మ, స్టేట్ ఓబీసీ మోర్చా కార్యదర్శి కర్రి రామకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి పట్టా ప్రసాద్, ఆరుగుళ్ళ కొండబాబు, జిల్లా ఉపాధ్యక్షులు పోలమర శెట్టి నాగేశ్వరరావు, వనం సత్యనారాయణ, పోల్నాటి నానాజీ, ముత్యాల అప్పారావు, బీజేపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వరి నాట్లలో ప్రత్యేక జాగ్రత్తలు అవసరం

అనకాపల్లి: తొలిపూత దశలో ఉన్న పచ్చిరొట్ట పైర్లను కాండం ముదిరిపోకుండా రానున్న వర్షాలను రైతులు సద్వినియోగం చేసుకుని నేలలో కలియ దున్నాలని, నారుమడులు నాటేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం డాక్టర్ ఏడీఆర్ సీహెచ్.ముకుందరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నారుమడుల్లో ఆకు చివరలను తుంచి 20 ఇన్‌టూ 15 సెం.మీ. దూరంలో కుదురుకు 2-3 మొక్కల చొప్పున చ.మీ.33 మొక్కల సాంద్రత ఉండేటట్టు నాటుకోవాలని, ప్రతి రెండు మీటర్లకు 20 సెం.మీ. బాటలు తియ్యడం మంచిదని ఆయన తెలిపారు. నాట్లు వేసుకునేటప్పుడు ఎకరాకు 35 కిలోల యూరియా, 150 కిలోల సింగిల్ సూపర్ ఫాస్పట్, 17 కిలోల మురేట్ ఆఫ్ పోటాష్‌ను, ఎకరాకు 20 కిలోల జింక్ సల్ఫేట్ వేసుకోవాలని ఆయన తెలిపారు. జింక్ సల్ఫేట్ వేసినప్పుడు భాస్వరం ఎరువులతో కలపకుండా, కనీసం మూడు రోజుల వ్యవధి ఉండేలా చూసుకోవాలని ఆయన కోరారు. వాతావరణ పరిస్థితులకు వరి నారుమడిలో పొడ తెగులు వచ్చే అవకాశం ఉందని, నివారణకు హెక్సాకొనజోల్ 2 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని ఆయన సూచించారు. మొక్కజొన్నలో కత్తెర పురుగు ఆశించే అవకాశం ఉందని, నివారణకు 10 కిలోల తవుడు 2 కిలోల బెల్లం, 2 లీటర్ల నీరు కలిపి 24 గంటల పాటు పులియబెట్టి ఆ మిశ్రమాన్ని 100 గ్రా. థయోడికార్బ్ మందుతో జోడించి సాయంత్రం వేళల్లో సుడులతో వేసి నివారించవచ్చని ఆయన చెప్పారు.

మొరాయిస్తున్న ట్రాఫిక్ సిగ్నల్



నెహ్రూచౌక్‌లో ట్రాఫిక్ సిగ్నల్

అనకాపల్లి : పట్టణానికి ప్రధాన కేంద్రమైన నెహ్రూచౌక్‌లో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. 15 సంవత్సరాల క్రితం ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఇక్కడ సిగ్నల్ వ్యవస్థ తరుచూ మొరాయిస్తోంది. గత 10రోజులుగా ఎన్టీఆర్ క్రీడా మైదానం నుంచి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే రహదారిలో సిగ్నల్ రెడ్, గ్రీన్ ఒకేసారి చూపించడంతో వాహనదారులు అయోమయానికి గుర య్యారు. తక్షణం సిగ్నల్ వ్యవస్థను సరిదిద్దాలని కోరుతున్నారు.

ఎస్సీ వర్గీకరణను అడ్డుకుంటాం...



నెహ్రూచౌక్ వద్ద ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన తెలియజేస్తున్న ఎయిమ్ సభ్యులు

అనకాపల్లి : ఎస్సీ వర్గీకరణను ఎట్టి పరిస్థితిల్లోను అడ్డుకుంటామని రాజ్యాంగాన్ని కాపాడుకుంటామని అంబేడ్కర్ ఇండియన్ మిషన్ జిల్లా అధ్యక్షుడు పాల్తేటి పెంటారావు అన్నారు. స్థానిక నెహ్రూచౌక్ అంబేడ్కర్ విగ్రహం వద్ద వర్గీకరణ అంతము మాల పంతము అనే నినాదంతో శనివారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిమ్ అధ్యక్షుడు పి.వి.సునీల్‌కుమార్ నాయకత్వంలో వర్గీకరణ ఉద్యమం తీవ్రతరం చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మిషన్ జిల్లా ఇన్‌ఛార్జి టి.టి.అప్పారావు, జిల్లా కార్యదర్శి గొంది అప్పారావు, విశాఖ జిల్లా అధ్యక్షుడు బోగేష్ పాల్గొన్నారు.

ఘనంగా వెంకన్న ఆలయ ద్వారబంధం ప్రతిష్ట



వేంకటేశ్వర స్వామి ఆలయ ద్వారబంధం ఏర్పాటుకు పూజలు



వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం అందజేస్తున్న సతీష్‌కుమార్

మునగపాక : మునగపాకలో శనివారం కలియుగ దైవం శ్రీనివాసుని ఆలయ ద్వార బంధం ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మునగపాక బైపాస్ రోడ్డులో నూతనంగా రూ.4 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ ద్వారబంధం ప్రతిష్ఠించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. వారికి కమిటీ సభ్యులు ప్రసాద వితరణ చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, జనసేన ఉత్తరాంధ్ర కన్వీనర్ సుందరపు సతీష్‌కుమార్‌తో పాటు పలు రాజకీయ పార్టీ నేతలు హాజరయ్యారు. కాగా వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి సతీష్‌కుమార్ రూ.లక్ష విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సూరిశెట్టి రాము, పెంటకోట ఉమేష్, టెక్కలి పరశురామ్, బొడ్డేడ అప్పలనాయుడు, కాండ్రేగుల జగ్గారావు, పొలిమేర కృష్ణ, మొల్లేటి సత్యనారాయణ, విల్లూరి నూకనరసింగరావు, దాడి అప్పలనాయుడు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో దాడుల సంస్కృతి



అడ్డురోడ్డులో కొవ్వొత్తులతో ప్రదర్శన చేస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం : దేశంలో గొప్ప పనులు చేసిన వారి పేర్లు శిలాఫలకంలో పెడితే కూటమి ప్రభుత్వానికి నచ్చడం లేదని మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. విజయవాడలో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాజ్యాంగ నిర్మాత పేరు భవిష్యత్ తరాలకు మరింత చేరువుగా ఉండేందుకు అతిపెద్ద విగ్రహం ఏర్పాటు చేస్తే ఇప్పుడు నూతనంగా వచ్చిన కూటమి ప్రభుత్వ పెద్దలకు నచ్చలేదని అన్నారు. ఆ దాడులకు నిరసనగా అడ్డురోడ్డు కూడలిలో కొవ్వొత్తులతో ప్రదర్శన చేశారు. ఇకపై ఇటువంటి దాడులు, దారుణాలు మానుకోవాలని సూచించారు. కొవ్వొత్తుల ర్యాలీలో మండల పార్టీ అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందు, జెడ్పీటీసీ కాకర దేవి, వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న, ఎంపీపీ కోన లోవలక్ష్మి, సర్పంచ్‌లు కర్రి సత్యనారయణ, ధూలి శ్రీనుబాబు, పాలపర్తి పాపారావు, ఎంపీటీసీలు బాలం సూరిబాబు, కేసుబోయిన వెంకటలక్ష్మి, పోలవరపు పార్వతి, నాగంబోయిన ఉమ, జిల్లా పార్టీ కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, యూత్ అధ్యక్షుడు నల్లపరాజు వెంకటరాజు, నాయకులు అద్దేపల్లి బొజ్జన్న, బొండా దివాణం, గరగా శ్రీనువాసరావు, వైబోయిన సత్యనారాయణ, చోడిపల్లి గోవిందు, చొప్పా రాజు తదితరులు ఉన్నారు.

13న హలో మాదిగ..చలో హైదరాబాద్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కట్టమూరి మంగరాజు

అనకాపల్లి : ఎస్సీ వర్గీకరణలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు పట్ల దేశ ప్రజలు ఎంతో ఆనందంతో ఉన్నారని, ఈ విషయంపై ఈనెల 13న హైదరాబాద్‌లో మాదిగ విజయోత్సవ ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు కట్టమూరిత మంగరాజు అన్నారు. స్థానిక భీమునిగుమ్మం ఎమ్మార్పీఎస్ కార్యాలయలో విజయోత్సవ ర్యాలీ గోడపత్రికలను శనివారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. మాదిగల మహాత్ముడు మంద కృష్ణ మాదిగ ఢిల్లీ నుండి విజయభేరి మోగించి హైదరాబాద్ విచ్చేస్తున్న సందర్భంగా అందరూ స్వాగతం చెప్పి విజయవంతం చేయాలని ఆయన కోరారు. విశాఖ ఉమ్మడి జిల్లాల్లో ఉన్న ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకినాడ కనకేశ్వర రావుమాదిగ, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు గొటివాడ సామ్రాట్ కుమార్ మాదిగ, అనకాపల్లి నియోజకవర్గం ఇన్‌ఛార్జి చెవ్వేటి కమల జగదీశ్వర రావుమాదిగ, జిల్లా సీనియర్ నాయకులు గంట్యాడ సత్తిబాబు, గొటివాడ రవిబాబు, పెట్ల అచ్చిం నాయుడు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉచితంగా ఇళ్లు నిర్మించి ఇవ్వాలి

కశింకోట : దివ్యాంగులకు ఉచితంగా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, ఇందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నరసింగబిల్లి, జెట్టపురెడ్డితుని, చింతలపాలెం గ్రామాల వికలాంగుల సంఘం సమావేశం కోరింది. మండలంలోని నరసింగబిల్లిలో సంఘం సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సమస్యలు పరిష్కరించాలని సమావేశం డిమాండ్ చేసింది. వివాహం అంశం లేకుండా దివ్యాంగులకు అంత్యోదయ కార్డులు ఇవ్వాలని, దివ్యాంగులు వివాహం చేసుకుంటే పెళ్లి కానుక ఇవ్వాలని, ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే చోట ర్యాంపులు నిర్మించి వీల్ ఛైర్లను దివ్యాంగులకు అందుబాటులో ఉంచాలని సమావేశం కోరింది. ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలని, దివ్యాంగులకు మండల స్థాయిలో సామాజిక భవనం నిర్మించాలని, ప్రభుత్వ, ప్రైవేటు పరిశ్రమల్లో పని చేసే దివ్యాంగులకు భద్రత కల్పించాలని,జాతీయ ఉపాధి పథకంలో దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా గ్రూపు ఏర్పాటు చేసి ఉపాధి కల్పించాలని సమావేశం కోరుతూ తీర్మానించింది. సంఘ ప్రతినిధులు షేక్ రెహమాన్, ముత్యాల సీతారాం, మల్లి శిరీష, పి.రామ్మూర్తి, మేడిశెట్టి ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా యూటీఎఫ్ 50వ ఆవిర్భావ దినోత్సవం



యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని జెండాను ఆవిష్కరిస్తున్న గొంది చినబ్బాయ్

అనకాపల్లి : బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు ఉచిత విద్య అందించడానికి ప్రభుత్వాలు కృషి చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయ్ అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయం వద్ద శనివారం యూటీఎఫ్ 50వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య అందరికీ అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర చరిత్రలో విద్యారంగం ఒక ప్రయోగశాలగా మారిందని, ప్రభుత్వం మారుతున్న ప్రతిసారి, ప్రభుత్వ విద్యా రంగంలో విధానాలు మారిపోతూన్నాయని అన్నారు. విద్యా విధానంలో కామన్ సిలబస్ తేవాలని, ప్రైవేట్ విద్యా రంగంలో ఫీజులు విపరీతంగా పెరిగాయని, సామాన్య ప్రజలకు ఉన్నత విద్య అందని ద్రాక్షగా మారుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు నెల్లి సుబ్బారావు, జిల్లా అధ్యక్షులు వత్సవాయి శ్రీలక్ష్మి, కోశాధికారి జోగా రాజేష్, కార్యదర్శులు రమేష్ బాబు, శేషుబాబు, సీనియర్ నాయకులు ఎల్లయ్యబాబు, అప్పారావు, రాజునాయుడు, సతీష్, శాంతి, కామరాజు, శ్రీను, సలీం, గేదెల శాంతి దేవి, శివప్రసాద్, అజయ్, సత్యనారాయణ పాల్గొన్నారు.